క్లుప్తంగా

పక్కాగా రెవెన్యూ సదస్సులు

పాలకొండ: రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం చేపడుతున్న రెవెన్యూ సదస్సులను సక్రమంగా నిర్వహించాలని తహసీల్దార్ బాల మురళీకృష్ణ అన్నారు. శనివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వీఆర్ఓలు, గ్రామ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలోనూ సదస్సులు నిర్వహించి భూ సమస్యలపై రైతుల నుంచి ఫిర్యాదులు తీసుకోవాలన్నారు. ఆయనతో పాటు డీటీ సన్యాసి రావు ఉన్నారు.

14 గ్రామాల్లో పెసా ఎన్నికలు



దాసుపురంలో ఎన్నికైన అభ్యర్థికి ధ్రువపత్రం అందిస్తున్న అధికారులు

సీతంపేట: మండలంలోని 14 గ్రామాల్లో పెసా (పంచాయతీరాజ్ ఎక్స్‌టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏజెన్సీస్) ఎన్నికలు శనివారం నిర్వహించారు. మొత్తం 15 గ్రామసభలు నిర్వహించి ఉపాధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకున్నారు. సోమవారం మరో 17 గ్రామాల్లో పెసా సభలు నిర్వహించనున్నట్లు ఐటీడీఏ పీఓ యశ్వంత్‌కుమార్ రెడ్డి తెలిపారు.

108 సిబ్బందికి శిక్షణ



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న ప్రోగ్రామింగ్ అధికారి శ్రీనివాసరావు

పాలకొండ రూరల్: ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా 108 సిబ్బంది క్షతగాత్రులు, బాధితులకు సేవలు అందించాలని రిఫ్రెషర్ ట్రైనింగ్ ప్రోగ్రామింగ్ అధికారి ఆలుబిల్లి శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో 108 జిల్లా మేనేజర్ ఎస్.మన్మధనాయుడుతో కలసి సిబ్బందికి ఎమర్జెన్సీ వైద్యంపై అవగాహన కల్పించారు. మాతా, శిశు సంరక్షణ, గుండె సంబంధిత సమస్యలు, సీపీఆర్, తదితర అంశాలపై శిక్షణ అందించారు.

వేణుగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

బలిజిపేట: చిలకలపల్లి వేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాసంలో భాగంగా స్వామి వారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అందులో భాగంగా అర్చకులు రాంబాబు భక్తులు ఇచ్చిన పూలతో అలంకరించి స్వామివారికి పూజలు జరిపారు. గోదాదేవికి తిరుప్పావై ప్రవచనాలతో పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

మార్చిలోగా ఆస్పత్రి భవన నిర్మాణ పనుల పూర్తి

సాలూరు: వచ్చే ఏడాది మార్చిలోగా వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులు పూర్తి చేసి అప్పగించాలని స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి కాంట్రాక్టర్, అధికారులను ఆదేశించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిని శనివారం ఆమె సందర్శించారు. వంద పడకల ఆస్పత్రి పనుల ప్రగతిపై ఆరా తీశారు. ఆస్పత్రి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. పలు అంశాలపై చర్చించారు.



చలికాలం.. జరభద్రం!

- చలికాలంలో అగ్ని ప్రమాదాలకు ఆస్కారం
- చలిమంట కాగేటప్పుడు జాగ్రత్తలు తప్పనిసరి
- అప్రమత్తతతో ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు

గుమ్మలక్ష్మీపురం: చలికాలంలో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. వాటి బారినపడి ప్రాణాలు పోగొట్టుకోకుండా ఉండడంతో పాటు ఆస్తినష్టం జరగకుండా ఉండాలంటే చిన్నపాటి జాగ్రత్తలు పాటిస్తే చాలు అని అధికారులు సూచిస్తున్నారు. ముఖ్యంగా పూరిళ్లు, గడ్డివాములు, గొడౌన్‌లు, బహుళ అంతస్తు భవనాలు, ఆస్పత్రులు, హోటళ్లు, దుకాణాల వద్ద నిబంధనలు కచ్చితంగా పాటిస్తే అగ్నిప్రమాదాలను నివారించవచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా చలిమంట కాగేటప్పుడు నిప్పు బట్టలకు అంటుకోకుండా జాగ్రత్తగా ఉండాలంటున్నారు. పాలిస్టర్, నైలాన్ దుస్తులు ధరించుకుని మంటల వద్దకు వెళ్లొద్దని సలహా ఇస్తున్నారు. మంట కాగిన తర్వాత ఆ మంటను ఆర్పివేయాలని తెలుపుతున్నారు.

ప్రమాదాలకు కారణాలు..

- గ్రామీణ ప్రాంతాల్లో కట్టెల పొయ్యిలోని నిప్పులు, చలిమంటలు ఆర్పకుండా వదిలివేయడం
- కాల్చిన సిగరెట్ పీకలు, చుట్టలను ఎక్కడపడితే అక్కడ పారవేయడం
- గడ్డి, ధాన్యం కుప్పల సమీపంలో మంటలు వేయడం
- దీర్ఘకాలికంగా విద్యుత్ స్విచ్‌లను ఆన్‌చేసి ఉంచడం
- సుదూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు మెయిన్ స్విచ్ ఆఫ్ చేయకపోవడం
- విద్యుత్ పరికరాలు వాడుతూనే మధ్యమధ్యలో ఇతర పనులపై దృష్టి పెట్టడం
- పూరిళ్లల్లో నాణ్యత లేని వైర్లు వాడడం
- గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను ఆఫ్ చేయకుండా వదిలేయడం

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- ఇళ్లకు సమీపంలో గడ్డి వాములు వేయకూడదు
- వ్యర్థాలు తగలబెట్టే సమయంలో విధిగా కొంత నీరు దగ్గర ఉంచుకోవడం
- పూరిళ్లల్లో బొగ్గు, కట్టె, పొట్టు పొయ్యిలు వాడే వారు వాటిని పూర్తిగా ఆర్పామా లేదా అని ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలి
- కొవ్వొత్తులు, కిరోసిన్ దీపాలను మంచాలు, బీరువాలకు దగ్గరగా వదిలేయకూడదు
- గ్యాస్ లీక్ అవుతున్నట్లు అనుమానం వస్తే వెంటనే కిటికీలు, తలుపులు తెరవాలి
- గదిలోకి వీలైనంత వెలుతురు, గాలి వచ్చేలా ఏర్పాట్లు చేసుకోవాలి

ప్రమాదం నుంచి కాపాడడమిలా..

- దుస్తులకు నిప్పు అంటుకున్నప్పుడు భయంతో పరిగెత్తనీయకూడదు. కింద పడుకోబెట్టి వేరే దుస్తులను కప్పి, మంటలను ఆర్పివేయాలి
- కాలిన శరీరంపై చల్లని నీరు పోయవద్దు
- పూర్తిగా పొగ నిండినపుడు అది బయటకు వచ్చే వరకు సాధ్యమైనంత మేర గాలి పీల్చకుండా ఉంటే మంచిది
- ప్రమాదం బారినపడిన వ్యక్తిని గాలి ఆడే ప్రదేశంలో ఉంచాలి

ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు తప్పనిసరి..

షాపింగ్ కాంప్లెక్స్‌లు, హోటళ్లు, సినిమా థియేటర్లు, రైస్‌మిల్లులు, పెట్రోలు బంకులు, ఆస్పత్రులు, స్కూల్ బస్సుల్లో ప్రమాదాలు జరగకుండా ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు తప్పనిసరిగా ఉండాలి. ఇవి ఉంటే ప్రమాదం జరిగినప్పుడు ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చూడొచ్చు.

తక్షణమే ప్రమాద సమాచారం ఇవ్వాలి..



ఎక్కడైనా అగ్నిప్రమాదం సంభవిస్తే తక్షణమే సంబంధిత ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస మండలాలతో పాటు కొమరాడ మండలంలోని నాగావళి నదికి ఇవతలి వైపు ఎక్కడైనా అగ్నిప్రమాదాలు జరిగితే గుమ్మలక్ష్మీపురంలోని అగ్నిమాపక కేంద్రం కార్యాలయం నంబర్లు 08963-223322, 7075095055ను సంప్రదించాలి.

–డి.శ్రీరాములు, గుమ్మలక్ష్మీపురం, అగ్నిమాపక అధికారి

● నిరసన..



అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం ఎంపీడీఓపై జరిగిన దాడిని ఖండిస్తూ శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. ఎంపీడీఓ బి.వెంకటరమణ, కార్యాలయ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి నినాదాలు చేశారు. దాడికి పాల్పడిన వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. - వీరఘట్టం

● విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం



విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తోందీ చిత్రం.. కొమరాడ మండలం, సుందరాపురం ప్రధాన రహదారిపై అత్యంత ప్రమాదకరంగా విద్యుత్ హెచ్‌టీ(హైటెన్షన్) లైన్(వైరు) వేలాడుతోంది. ఓ కర్రను ఆధారంగా చేసుకుని, వైరును నిలబెట్టారే తప్ప విద్యుత్ స్తంభం ఏర్పాటు చేసే ఆలోచనను సంబంధిత అధికారులు చేయకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. చాలాచోట్ల విద్యుత్ వైర్లు తెగిపడి ఎంతోమంది ప్రాణాలు కోల్పోయినా పట్టించుకోరా అని ప్రశ్నిస్తున్నారు. ఎటువంటి ప్రమాదం జరగకముందే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

-కొమరాడ

● అప్రమత్తం..



గుడ్ అండ్ బ్యాడ్ టచ్ విషయంలో బాలికలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై జి.కళాధర్ సూచించారు. రేగులపాడు కేజీబీవీలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే పోలీసులు, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. - వీరఘట్టం

18 ఏళ్ల లోపు వివాహం చేయరాదు..

● ఎంపీడీఓ గీతాంజలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ గీతాంజలి

సీతంపేట: అమ్మాయిలకు పద్దెనిమిదేళ్ల లోపు వివాహం చేయడం చట్టరీత్యా నేరమని ఎంపీడీఓ గీతాంజలి అన్నారు. ఐసీడీఎస్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో శనివారం స్థానిక సామాజిక భవనంలో కిశోరీ వికాసంపై శిక్షణ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలపై గ్రామస్థాయిలో కూడా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. అనంతరం కిశోర బాలికల హక్కులు, బాల్య వివాహాలు, గుడ్ అండ్ బ్యాడ్ టచ్ అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ పి.రంగలక్ష్మి, జిల్లా రిసోర్స్ లీగల్ ఆఫీసర్ పి.శ్రీధర్, ఎస్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

విష్ణు సహస్రనామ పారాయణం



పారాయణం చేస్తున్న భక్త బృందం

గరుగుబిల్లి: తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో విష్ణు సహస్రనామ పారాయణం భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ అనంతరం భక్తులకు సర్వదర్శనం కల్పించారు. అనంతరం వీరఘట్టం ప్రాంతానికి చెందిన లలిత కోటి పారాయణ బృందం వారు విష్ణు సహస్ర నామ పారాయణం చేపట్టారు. ధనుర్మాసోత్సవంలో భాగంగా తిరుప్పావై పారాయణం కూడా చేశారు. మధ్యాహ్నం దాతల సహకారంతో భక్తులకు అన్నదానం చేశారు.

రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటరమణ

వీరఘట్టం: చిన్నారులు, బాలింతలు, కిశోర బాలికలు, గర్భిణుల్లో రక్తహీనత నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ బెందాళం వెంకటరమణ సూచించారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైద్యారోగ్యశాఖ సిబ్బంది, ఐసీడీఎస్, విద్యాశాఖాధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. రక్తహీనత నివారణకు ప్రతి గ్రామంలోన కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు

గరుగుబిల్లి: ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్య శాఖ జిల్లా ప్రోగ్రాం అధికారి టి.జగన్మోహనరావు సూచించారు. మండలంలోని తోటపల్లి, సంతోషపురం గ్రామాలను శనివారం సందర్శించిన ఆయన.. ఆయా గ్రామాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలపై సిబ్బందిని ఆరాతీశారు. గర్భిణుల నమోదు, హైరిస్క్ గర్భిణుల గుర్తింపు, రక్తహీనతతో బాధపడుతున్న వారికి సకాలంలో వైద్యం అందజేత, మాతాశిశు ఆరోగ్య సంరక్షణ, క్షయ, కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు, ఎన్సీడీ సర్వేల గురించి అడిగి, ఆయా రికార్డులు పరిశీలించారు. ఎనీమియా యాక్షన్ కమిటీలు పక్కాగా నిర్వహించి, రక్తహీనత నివారణకు కృషి చేయాలని అయన తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వెళ్లి, విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యాలయ స్టాటిస్టికల్ అధికారి శంకర్, వైద్య సిబ్బంది యశోద, కళావతి, కాత్యాయని తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం..

● మాజీ ఎమ్మెల్యే కళావతి



బత్తిలిలో బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి, పార్టీ నాయకులు

భామిని: మండలంలోని తాలాడ, బత్తిలి, బిల్లుమడ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు వివిధ కారణాలతో ఇటీవల మరణించారు. వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే కళావతి శనివారం పరామర్శించి, ఓదార్చారు. మృతుల కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని చెప్పారు. తాలాడలో ఎరుకుమజ్జి చిరంజీవులు(75), బత్తిలికి చెందిన బాదాపు సుషాంత్(38), బిల్లుమడకు చెందిన దామోదర సత్య (82) వివిధ కారణాలతో మృతి చెందారు. వీరి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే, తదితరులు పరామర్శించారు. పరామర్శలో సర్పంచ్‌లు ఎరుకుమజ్జి ప్రభావతి, జామి ప్రభాకర్, పార్టీ నాయకులు టి.అన్నాజీరావు, బి.ధర్మారావు, వై.పాపినాయుడు, టి.సింహాచలం, కె.చంద్రశేఖర్, ఎం.చలపతి, ఎస్.తిరుపతి, ఎస్.బాలయ్య, ఆర్.రాజు, ఎస్.రాజు, తదితరులున్నారు.

కందికొత్తల ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఉత్సవాలకు ఆహ్వానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలోని హెచ్ గ్రౌండ్ వద్ద ఆదివారం నిర్వహించనున్న కందికొత్తల ఉత్సవాలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని ఉత్సవ కమిటీ సభ్యులు నాగభూషణరావు, ఎం.రమణ, ఎన్.శేఖర్, క్రాంతికుమార్, లోవరాజులు ఆహ్వానించారు. మండల కేంద్రంలోని ఆమె స్వగృహానికి శనివారం వెళ్లిన వారంతా ఉత్సవాల ఆహ్వాన పత్రం ఆమెకు అందజేశారు. గిరిజనుల ఆచార సంప్రదాయాలు ప్రతిబింబించేలా జరిగే ఈ ఉత్సవాల్లో పాల్గొనాలని కోరారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలు వివరిస్తున్న ఎస్ఐ అనీష్

జియ్యమ్మవలస: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని చినమేరంగి ఎస్ఐ పి.అనీష్ సూచించారు. మండలంలోని అల్లువాడ వద్ద శనివారం వాహన తనిఖీలు నిర్వహించారు. అటువైపుగా రాకపోకలు సాగించే వాహనదారులను ఆపి, వారి లైసెన్స్‌లతో పాటు వారి వాహన ధ్రువపత్రాలను ఎస్ఐ క్షుణ్ణంగా పరిశీలించారు. వాహనాలతో బయటకు వచ్చేటప్పుడు వాహన ధ్రువపత్రాలు, లైసెన్స్‌లు వెంట తీసుకురావాలన్నారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు. ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కోరారు.

ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను తెలియజేయాలి



మాట్లాడుతున్న ఏపీడీ సురేష్‌నాయుడు

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయం ఆవశ్యకతను రైతులకు తెలియజేయాలని జట్టు వ్యవస్థాపకుడు డి.పారినాయుడు అన్నారు. మండలంలోని తోటపల్లి అన్నపూర్ణేశ్వరి గిరిశక్తి సమావేశ మందిరంలో కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాలకు చెందిన 60 మంది ప్రకృతి వ్యవసాయ కార్యకర్తలకు రెండు రోజుల పాటు ఇచ్చే శిక్షణ తరగతులు శనివారం ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ మారుతున్న పరిస్థితుల దృష్ట్యా ప్రకృతి సాగును ప్రోత్సహించాలన్నారు. శిక్షణ తరగతుల్లో నేర్చుకున్న అంశాలను గ్రామాల్లోని రైతులకు వివరించాలన్నారు. ఐటీడీఏ ఉపాధి హామీ ఏపీడీ ఆర్. సురేష్‌నాయుడు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో 96 రకాల పనులు ఉన్నాయని, వాటిని ఎంపిక చేసుకుని భూములను అభివృద్ధి చేసి మరీ ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా చేయాలన్నారు. ఉద్యాన తోటల పెంపకాన్ని ప్రోత్సహిస్తూ 20 రకాల పండ్ల మొక్కలు పంపిణీ చేయడం జరుగుతోందన్నారు.

ఘనంగా కళావతి జన్మదిన వేడుకలు



వీరఘట్టం: పుట్టిన రోజు వేడుకలో నిమగ్నమైన మాజీ ఎమ్మెల్యే కళావతి

భామిని: మండలంలోని బత్తిలిలో పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ మండల నాయకులు తోట సింహాచలం, టింగ అన్నాజీరావు, బోనగడ్డి ధర్మారావు, కొత్తకోట చంద్రశేఖర్, తదితరుల ఆధ్వర్యంలో కళావతి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మేడిబోయిన చలపతి, జామి ప్రభాకర్, శివ్వాల తిరుపతి, బొడ్డేపల్లి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే స్వగృహంలో..

వీరఘట్టం: పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి పుట్టినరోజు వేడుకలు శనివారం ఆమె స్వగృహమైన వండువలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానుల సమక్షంలో కళావతి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా పాలకొండ నగర పంచాయతీ చైర్మన్ పల్లా ప్రతాప్, వీరఘట్టం ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా కార్యదర్శి నల్లబల్లి సుహాసిని, విశ్వేశ్వరరావు, వండువ సర్పంచ్ మిడితాన కళ్యాణి, వెలమల మన్మధరావు, కడగల రమణ, శ్రీనివాసరావు, కోడెం విజయకుమార్, తమ్మగుంట శంకరరావు, కళావతికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



పాలకొండ రూరల్: వడమలో తడిచిన వరి పనలను చూపిస్తున్న బాధిత రైతు

రంగుమారిన ధాన్యం కొనుగోలు చేయాలి

వీరఘట్టం: ఇటీవల కురిసిన వర్షాలకు వరి కుప్పలు తడిచి పోవడంతో ధాన్యం రంగు మారాయని.. ఇటువంటి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. చిదిమి, తదితర గ్రామాల్లో వరి కుప్పలన్నీ తడిచిపోయాయని, ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని అన్నదాతలు కోరుతున్నారు. ప్రస్తుతం వాతావరణం పొడిగా ఉండడంతో తడిచిన ధాన్యం పనలను ఆరబెట్టే పనిలో రైతులు బిజీగా ఉన్నారు.

పరిహారం అందించాలి...

పాలకొండ రూరల్: ఖరీఫ్‌లో వర్షాలకు నష్టపోయిన వరి రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని వడమ ప్రాంతానికి చెందిన రైతులు ఎం.అప్పన్న, బి.రెయ్యమ్మ, శ్రీనివాసరావు, బి.దుర్గాప్రసాద్, తదితరులు కోరుతున్నారు. కోత సమయంలో వరుస వర్షాల కారణంగా తమ పంట నీట మునిగిందని వాపోయారు. మండల పరిధిలో వెలగవాడ, గరుగుబిల్లి, బాసూరు, రుద్రిపేట, తదితర గ్రామాల్లో కూడా రైతులు పూర్తి స్థాయిలో నష్టపోయారు. వరితో పాటు అపరాలైన పెసర, మినుము పంటలు కూడా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



వీరఘట్టం: తడిచిన వరి పనలను చూపిస్తున్న రైతులు